సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం। 16। సెప్టెంబర్। 2025



ఎట్టకేలకు బోనులోకి..

మహబూబ్‌నగర్ పట్టణ సమీపంలో కొన్ని రోజులుగా సంచరిస్తున్న చిరుత ఎట్టకేలకు బోనుకు చిక్కింది.

-8లో ▸



జూరాలకు పెరిగిన వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద సోమవారం పెరిగిందని అధికారులు తెలిపారు.

-8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2 /21.3

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజాపాలన దినోత్సవానికి ముఖ్యఅతిథిగా చిన్నారెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో ఈ నెల 17న నిర్వహించనున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో చిన్నారెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి ప్రసంగించనున్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



దోమలపెంట: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సోమవారం శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో జాతీయ ఇంజినీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం సీఈ కేవీవీ సత్యనారాయణ, ఎస్‌ఈలు రవీంద్రకుమార్, ఆదినారాయణ, డీఈలు, ఏడీఈలు, ఏఈలు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యదర్శి బి.మదన్మోహన్‌రెడ్డి (ఏడీఈ), చంద్రశేఖర్ (డీఈ), ఏఈల అసోసియేషన్ కార్యదర్శులు వై.నరేశ్, నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



వెల్దండ: ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వెల్దండలో పలువురికి సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యం ఇతరత్రా కారణాలతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే పేదలకు ప్రభుత్వం సీఎం సహాయనిధి అందించి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు శేఖర్, నాగులునాయక్, మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, బీఆర్‌ఎస్ నాయకులు నిరంజన్, నర్సింహ, మధుసూదన్‌రెడ్డి, జోగయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'నక్కలగండి' ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెంచాల్సిందే..



అచ్చంపేట రూరల్: నక్కలగండి ప్రాజెక్టులో సర్వం కోల్పోతున్న తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెంచడంతో పాటు ప్రతి కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. అచ్చంపేట మండలం మార్లపాడుతండా, కేశ్యాతండాల్లో సోమవారం అదనపు కలెక్టర్ అమరేందర్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించగా.. ముంపు బాధితులు తమ సమస్యలను వెలిబుచ్చారు. ఇంటి ఖాళీ స్థలాలకు గజం రూ. 3వేల చొప్పున చెల్లించడంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇంటికో ఉద్యోగం, మూడెకరాల భూమి, పట్టణాల సమీపంలో ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. అదే విధంగా ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధిపరిచి ముంపు బాధిత కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఆర్డీఓ మాధవి, తహసీల్దార్ సైదులు, ఆర్‌ఐ బాల్‌రాం, నాయకులు భాస్కర్, రవి ఉన్నారు.

కేఎల్‌ఐ కాల్వ నిర్మాణానికి సహకరించాలి

వెల్దండ: కేఎల్‌ఐ సబ్ కెనాల్ నిర్మాణానికి రైతులు సహకరించాలని భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్‌రావు, ఇరిగేషన్‌శాఖ అధికారి వెంకట్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని అజిలాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో కేఎల్‌ఐ సబ్ కెనాల్ నిర్మాణంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేఎల్‌ఐ డీ–8 కాల్వ ద్వారా మాడ్గుల మండలం పోలేపల్లి మీదుగా నాగిళ్ల వరకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. సబ్ కెనాల్ నిర్మాణంతో మాడ్గుల మండలంలోని చంద్రాయన్‌పల్లి, కలకొండ, వెల్దండ మండలం అంకమోనికుంట, అజిలాపూర్ గ్రామ రైతులకు సాగునీరు అందుతుందని వివరించారు. అజిలాపూర్‌కు చెందిన 30మంది రైతుల పొలాల్లో సబ్ కెనాల్ నిర్మాణం జరుగుతుందని.. రైతులకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లిస్తుందని తెలిపారు. కాల్వ నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు.

జిల్లాకేంద్రానికి చెందిన ఓ వివాహిత ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. మతిస్థిమితం కోల్పోయి జిల్లాకేంద్రంలోని బస్ డిపో, డంపింగ్‌యార్డు సమీపాల్లో తిరగాడుతుండగా.. సఖి కేంద్రం సభ్యులు గుర్తించారు. సఖి కేంద్రంలో ఆమెకు రక్షణ కల్పించి కొన్ని రోజులపాటు ఆశ్రయం ఇచ్చారు. అనంతరం హైదరాబాద్‌లో చికిత్స ఇప్పించగా **క్రమంగా కోలుకుంది.**

తెలకపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ప్రేమ పెళ్లి చేసుకుంది. వివాహమైన కొన్ని రోజుల నుంచే ఆమెను భర్తతో పాటు కుటుంబసభ్యులు తీవ్రంగా కొడుతూ హింసించారు. స్థానికుల సాయంతో సఖి కేంద్రానికి సమాచారం అందింది. నిమిషాల వ్యవధిలోనే కేంద్రం నిర్వాహకులు స్పందించి ఆమెను కాపాడారు. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి సమస్యను **పరిష్కరించారు.**

అతివలకు అభయం



జిల్లాకేంద్రంలోని సఖి కేంద్రం

మహిళలకు అండగా నిలుస్తున్న సఖి కేంద్రం

- వేధింపులకు గురయ్యే వారికి సత్వర సాయం
- ఈ ఏడాది 220 కేసులు పరిష్కారం
- జిల్లాలో వాహనం సైతం అందుబాటులోకి..

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలో మహిళలపై హింస, వేధింపుల కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. నిత్యం ఏదో ఒక చోట మహిళలు వేధన, హింసకు గురవుతున్నారు. ఈ క్రమంలో బాధిత మహిళలకు జిల్లా సఖి కేంద్రం అండగా నిలుస్తోంది. గృహహింస, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలకు సత్వర సహాయాన్ని అందిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు సఖి కేంద్రానికి 243 ఫిర్యాదులు రాగా.. ఇందులో 220 కేసులను పరిష్కరించారు.

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన కేసులు ఇలా..

గృహహింస కేసులు: 157	లైంగిక వేధింపులు: 2
బాల్యవివాహాలు: 19	మిస్సింగ్: 26
ఆశ్రయం పొందినవారు: 39	మొత్తం ఫిర్యాదులు: 243
పరిష్కరించినవి: 220	పెండింగ్‌లో ఉన్నవి: 23

వన్‌స్టాప్ సెంటర్‌గా 'సఖి' సేవలు..

గృహహింస, లైంగిక, వరకట్న వేధింపులు చోటు చేసుకున్నప్పుడు బాధిత మహిళలు సురక్షితంగా ఉండి.. సాంత్వన పొందేందుకు సఖి సెంటర్ కీలకంగా పనిచేస్తోంది. వన్ స్టాప్ సర్వీస్ (ఓఎస్‌సీ)గా ఏర్పాటై 24 గంటల పాటు పనిచేసే సఖి కేంద్రంలో బాధిత మహిళలకు అవసరమైన సత్వర సహాయాన్ని అందిస్తున్నారు. బాధితులకు కౌన్సెలింగ్, వైద్య సహాయం, న్యాయ సలహాలు అందించడంతో పాటు తాత్కాలిక వసతి కల్పిస్తున్నారు. గాయపడిన మహిళలకు సత్వర చికిత్స అందించడం, మెడికో లీగల్ సర్టిఫికెట్ పొందడం, పోలీస్, న్యాయ సహాయాన్ని పొందడంలో సహాయం చేస్తున్నారు. ఇటీవల జిల్లాలో మొబైల్ వ్యాన్ సైతం అందుబాటులోకి రావడంతో సఖి కేంద్రం సభ్యులు బాధితుల వద్దకే వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. రక్షణ అవసరమైన వారిని ప్రత్యేక వాహనంలో సఖి కేంద్రానికి తరలిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

సఖి కేంద్రంలో బాధిత మహిళలకు కౌన్సెలింగ్, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలికంగా ఆశ్రయం కల్పించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నాం. మహిళలపై హింస, లైంగిక దాడులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. బాధిత మహిళలు ఒక్క ఫోన్‌కాల్ చేసినా సకాలంలో స్పందిస్తున్నాం.

– సునీత, సఖి సెంటర్ కోఆర్డినేటర్



బాధిత మహిళల కోసం అందుబాటులోకి వచ్చిన వాహనం

నిరంతరం అందుబాటులో..

జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సఖి కేంద్రం ఉంది. ఇందులో ఒక అడ్మినిస్ట్రేటర్, ఇద్దరు కేస్ వర్కర్లు, లీగల్ కౌన్సెలర్, సైకో సోషల్ కౌన్సెలర్, అడ్మిన్ అసిస్టెంట్, పారామెడికల్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలామంది మహిళలకు సఖి సెంటర్, నంబర్‌పై అవగాహన లేక బాధితులు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. చాలా సందర్భాల్లో బాధిత మహిళలు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. స్థానికులు, చుట్టుపక్కల వారి సమాచారంతో, పోలీసుల ద్వారా విషయం సఖి సెంటర్‌కు చేరుతోంది. గృహహింస, లైంగిక వేధింపులు, పని ప్రదేశంలో వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు నేరుగా 181 లేదా జిల్లాలోని సఖి కేంద్రం నంబర్ 99519 40181ను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెబుతున్నారు.

మహిళా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- రేపటి నుంచి అక్టోబర్ 2 వరకు వైద్యశిబిరాలు
- మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్



తూడుకుర్తి పల్లె దావఖానాలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: మహిళా ఆరోగ్యంతోనే శక్తివంతమైన కుటుంబం సాధ్యమవుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వివిధ శాఖల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య మహిళా.. శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య నిపుణులచే ప్రత్యేకంగా వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరాల్లో రక్త పరీక్షలతో పాటు నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్, రక్తహీనత, క్షయవ్యాధి, సికిల్ సెల్ అనీమియా తదితర అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళా శిశు సంక్షేమశాఖ, డీఆర్డీఓ, విద్యాశాఖ, ట్రైబల్, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ సంక్షేమ శాఖల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

⇨ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 91 అర్జీలు అందాయని.. అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

⇨ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)–2026 ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ అన్నారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎస్‌ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచండి..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తిలో ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇళ్ల పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పల్లె దవాఖానాను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. దవాఖానాలో అందుబాటులో ఉన్న ఔషధాలు, వాటి కాలపరిమితిని పరిశీలించారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారుల ఆరోగ్యం, విద్య, పోషకాహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

విద్యార్థుల్లో సామాజిక స్ఫూర్తి పెంపొందాలి..

విద్యార్థులకు చిన్ననాటి నుంచే సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. తూడుకుర్తిలో సికింద్రాబాద్ కస్తూర్బాగాంధీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యతలు, పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ భన్సీలాల్, డీఈఓ రమేశ్ కుమార్, డీసీహెచ్ఎస్ డా.రామకృష్ణ, ఆర్ఎంఓ డా.రవిశంకర్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల బారులు



పెద్దకొత్తపల్లి సింగిల్‌విండో వద్ద బారులు తీరిన రైతులు

పెద్దకొత్తపల్లి: రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. రెండు బస్తాల యూరియా కోసం గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. సోమవారం పెద్దకొత్తపల్లి సింగిల్‌విండో కార్యాలయం వద్ద రైతులు తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు. వివిధ గ్రామాల నుంచి దాదాపు 600 మంది రైతులు యూరియా కోసం రాగా.. కేవలం 120 మందికి మాత్రమే రెండు బస్తాల చొప్పున యూరియా లభించింది. మిగతా రైతులు నిరాశతో వెనుదిరిగారు. వారానికి ఒక లారీ చొప్పున యూరియాను సరఫరా చేస్తుండటంతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉండటం.. యూరియా సకాలంలో లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వానాకాలం పంటలకు సరిపడా యూరియా అందించాలని కోరుతున్నారు.

పోలీసు ప్రజావాణికి 15 ఫిర్యాదులు



నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ప్రజల ను ంచి ఫిర్యాదులు స్వీకరించారు. భూ తగాదాలపై 10, కుటుంబ గొడవలపై 2, ఇతర వా టిపై 3 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు.

ఐసీడీఎస్‌ను నీరుగార్చేందుకు కుట్ర



కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీ వర్కర్లు

కొల్లాపూర్: ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, అంగన్‌వాడీ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతమ్మ, మాసమ్మ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లోని మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంప్ కార్యాలయాన్ని అంగన్‌వాడీ వర్కర్లు ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఎం శ్రీవిద్య ద్వారా ఐదేళ్లలోపు చిన్నారులను కూడా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని నిర్ణయించడం సరికాదన్నారు. ప్రభుత్వ విధానాలతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. పీఎం శ్రీవిద్య అమలు బాధ్యత అంగన్‌వాడీ వర్కర్లకు అప్పగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల పక్షాన నిలవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు, ఏరియర్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడంతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయుల తరహాలోనే జీతాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 25న చలో సెక్రటేరియట్ చేపడతామన్నారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయ ఓఎస్డీ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నా యకులు పర్వతాలు, శివవర్మ, రామయ్య, రాము, రాజు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

హే కృష్ణా.. ఇకనైనా!

కృష్ణజింకలతో పంట పొలాలు నాశనం

- కృష్ణానది పరీవాహకంలో అన్నదాతల అగచాట్లు
- విజ్ఞప్తులు.. ప్రతిపాదనలు.. ఆదేశాలకే పరిమితం
- రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటులో జాప్యం
- నష్టంతోపాటు నిత్యం కాపలాతో రైతులకు తప్పని తిప్పలు



పత్తి పొలంలో గుంపులుగా సంచరిస్తున్న కృష్ణజింకలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: నారాయణపేట జిల్లా కృష్ణానది పరివాహక ప్రాంతాల్లోని రైతుల రోదన అరణ్య రోదనగా మిగులుతోంది. వేల సంఖ్యలో కృష్ణ జింకలు పంటలను నాశనం చేస్తుండడం ఏటేటా నిత్యకృత్యంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. ఫలితం లేకపోవడంతో బాధిత రైతుల్లో ఆందోళన నెలకొంది. కృష్ణ జింకలను పట్టుకుని అడవులకు తరలించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించినా.. రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటులో జాప్యం జరుగుతూనే ఉంది. అధికారుల్లో కొరవడిన ప్రణాళిక, పలు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లేమి వెరసీ రైతులకు తిప్పలు తప్పడం లేదు.

సుమారు 12 వేల జింకలు..

కృష్ణానది పరివాహకమైన మాగనూరు, కృష్ణా, నర్వ, మరికల్, మక్తల్ మండలాల పరిధిలో ప్రధానంగా వరి, పత్తి, కంది సాగవుతోంది. సుమారు 10, 12 ఏళ్ల క్రితం ఆయా ప్రాంతాల్లో వందలలోపే ఉన్న కృష్ణ జింకల సంతతి క్రమక్రమంగా పెరిగింది. ప్రస్తుతం 10 వేల నుంచి 12 వేల వరకు కృష్ణ జింకలు ఉన్నట్లు అటవీ శాఖ అంచనా. అవి ఆహారం కోసం మూకుమ్మడిగా పంట చేల్లోకి వస్తుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విత్తనాలు, కాయలు, తీగలు..

కృష్ణ జింకలు పంట పొలాల్లో తిరగాడే క్రమంలో చేలల్లో మొదట్లో వేసిన విత్తనాలు మొలకెత్తడం లేదు. దీంతో నాలుగైదు పర్యాయాలు విత్తనాలు వేయడం ఆయా రైతులకు ఏటా పరిపాటిగా మారింది. ఇంతే కాకుండా.. పత్తి కాయలు, కంది కాయలను సైతం జింకలు ఆహారంగా తీసుకుంటుండడంతో పంటలు సరిగ్గా చేతికి రావడం లేదు. వరి పంటలో గుంపులు గుంపులుగా జింకలు తిరుగుతుండడంతో వేసిన గొలుసులు తెగిపోయి నష్టం వాటిల్లుతోంది. దిగుబడి తగ్గుతుండడంతో ఆ రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. పంటలు కాపాడుకోవడం ఒక ఎత్తు అయితే.. ప్రతి ఏటా నష్టం వాటిల్లుతుండడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయామని రైతులు గోడు వెళ్లబోసుకుంటున్నారు.

ప్రభుత్వం స్పందించినా..

కృష్ణాతీరంలో కృష్ణ జింకల బెడద నుంచి పంటలను కాపాడాలని రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించింది. జింకలను పట్టి నల్లమల, కవ్వాల్ అడవులకు తరలించాలని ప్రభుత్వం ఏర్పాటైన తొలినాళ్లలోనే నిర్ణయించి.. రూ.2.70 కోట్ల నిధులు సైతం కేటాయించింది. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు అటవీ శాఖ ముందుగా రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కృష్ణా మండలం ముడుమాల్ వద్ద అందుబాటులో ఉన్న భూమిని అధికారులు పరిశీలించారు. సర్వే నం.192లోని 18.29 ఎకరాలు, సర్వే నం.194లోని 55.21 ఎకరాలు మొత్తం కలిపి 74.10 ఎకరాల్లో రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. కానీ, ఇందులో తొలుత ఎనిమిది ఎకరాలు, ఆ తర్వాత సుమారు 30 ఎకరాల్లో చెరువు ఉండడం, రెవెన్యూ శాఖ తిరకాస్తు వంటి సమస్యలతో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఎన్ని ప్రయత్నాలు చేసినా..



మా కుటుంబానికి దాదాపు 30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రతిఏటా పత్తి వేస్తున్నాం. జింకల వల్ల విత్తనాలను మళ్లీ మళ్లీ నాటడం ఆనవాయితీగా మారింది. కాయలు పడుతున్నప్పుడు గుంపులుగా దాడి చేసి తింటున్నాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా.. అవి చేనులోకే వస్తున్నాయి. జింకలను పట్టి పరిరక్షణ కేంద్రాలకు తరలించాలి.

– అంజయ్య, గుడేబల్లూరు, కృష్ణా మండలం, నారాయణపేట జిల్లా

ఎట్టకేలకు ముందడుగు..


కృష్ణ జింకల రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు దిశగా ముడుమాల్ వద్ద 74.10 ఎకరాల భూమి హద్దులను రెవెన్యూ అధికారులు గుర్తించి మార్కింగ్ చేశారు. ఇటీవల ఆ భూమిని అటవీ శాఖకు అప్పగిస్తూ ఆర్డర్లు సైతం జారీ అయ్యాయి. దీంతో అటవీ శాఖ ఎట్టకేలకు రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు పనుల కోసం టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతోంది. చెరువు పరిధిలోకి రాని సుమారు 44 ఎకరాల్లో శాశ్వత, చెరువు పరిధిలోకి వచ్చే 30 ఎకరాల్లో తాత్కాలికంగా పనులు చేపట్టేలా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఎలాంటి జాప్యం లేకుండా చూసి.. జింకల సమస్య తీర్చాలని రైతులు వేడుకుంటున్నారు.

అక్టోబర్ 15 వరకు..

ముడుమాల్ వద్ద రిహాబిలిటేషన్ సెంటర్‌కు ఈ నెలాఖరులోపు టెండర్లు పిలిచి.. వచ్చేనెల 15 వరకు పనులు మొదలుపెడుతాం. దీంతోపాటు ఎక్కడైతే కృష్ణ జింకలు ఎక్కువ ఉన్నాయో.. అక్కడ మినీ రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. అక్కడి నుంచి రిహాబిలిటేషన్ సెంటర్‌కు.. ఆ తర్వాత క్రమంగా నల్లమల లేదా కవ్వాల్ అడవులకు తరలిస్తాం. నర్వ మండలం రాయికోడ్ గ్రామంలో మినీ రిహాబిలిటేషన్ సెంటర్ కోసం పది ఎకరాల్లో భూమి గుర్తించాం. ఇక్కడ పైలెట్ ప్రాజెక్ట్‌గా ఈ సెంటర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– అరవింద్‌రెడ్డి, డీఎఫ్‌ఓ, నారాయణపేట

రోజూ కాపలానే..



నేను 20 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. ప్రస్తుతం కాయలు కాసే దశ. ప్రతిరోజూ కాపలా ఉంటున్నా. ఇప్పుడే కాదు.. విత్తనాలు పెట్టిన నాటి నుంచి పత్తి చేతికొచ్చే వరకూ జింకలు రాకుండా ప్రతిరోజూ నాకు ఇదే పని. జింకలను ఇక్కడి నుంచి అటవీ ప్రాంతానికి తరలిస్తేనే మా సమస్య తీరుతుంది. అధికారులు ఇప్పటికైనా పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.

– బస్లింగప్ప, చేగుంట, కృష్ణా మండలం, నారాయణపేట జిల్లా

ఎట్టకేలకు.. బోనులోకి

- రెండున్నర నెలలుగా ముప్పతిప్పలు పెట్టిన చిరుత
- తాజాగా తిర్మల్‌దేవునిగుట్ట వద్ద పట్టుబడిన వైనం
- హైదరాబాద్‌లోని నెహ్రూ జూ పార్కుకు తరలింపు
- ఊపిరి పీల్చుకున్న పాలమూరు పట్టణవాసులు



చిరుతను బోనుతో సహా ట్రాక్టర్‌లో అటవీ శాఖ కార్యాలయానికి తరలిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పాలమూరు పట్టణ ప్రజలను రెండున్నర నెలలుగా భయాందోళనకు గురిచేస్తున్న చిరుత ఎట్టకేలకు చిక్కింది. జిల్లాకేంద్రానికి అతి సమీపంలోని తిర్మల్‌దేవునిగుట్ట, వీరన్నగట్టు, డంపింగ్ యార్డుల్లో తిరగాడుతున్న చిరుతను బంధించేందుకు చేసిన ప్రయత్నాలు చివరికి ఫలించాయి. వీరన్నపేట సమీపంలో తిర్మల్‌దేవునిగుట్ట వద్ద ఏర్పాటు చేసిన బోనులోని మేకపిల్లను తినేందుకు వచ్చిన చిరుత సోమవారం బోనుకు దొరికిపోయింది. దీంతో పట్టణ ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాకేంద్రం శివారులోని గుట్టల్లో తిరుగుతున్న చిరుతను బంధించేందుకు కొంతకాలంగా అటవీ, పోలీసు, మున్సిపల్ శాఖల సమన్వయంతో సెర్చ్ ఆపరేషన్ చేసినా తప్పించుకు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేసింది. ఈ క్రమంలో అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ.. ట్రాప్, సీసీ, లైవ్ కెమెరాలతో చిరుత సంచారాన్ని నిరంతర పర్యవేక్షణ చేసి ఎట్టకేలకు బోనుకు చిక్కేలా చేశారు. కాగా.. బోనులో పడిన చిరుత బయటికి వెళ్లేందుకు ప్రయత్నించిన క్రమంలో తల ముందుభాగంలో స్వల్పగాయాలయ్యాయి. చిరుతను ట్రాక్టర్‌లో జిల్లా అటవీశాఖ కార్యాలయానికి తరలించి.. అక్కడ వెటర్నరీ వైద్యులతో చికిత్స అందించారు. అనంతరం కలెక్టర్ విజయేందిర, డీఎఫ్‌ఓ సత్యనారాయణ సమక్షంలో డీసీఎం వాహనంలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూలజికల్ పార్క్‌కు తరలించారు. అక్కడ వెటర్నరీ వైద్య నిపుణులు చిరుతకు వైద్య పరీక్షలు నిర్వహించి.. 18 నెలల వయసుతోపాటు ఆడపులిగా నిర్ధారించినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు.



తిర్మల్‌దేవునిగుట్ట వద్ద బోనులో చిక్కిన చిరుత

అప్రమత్తంగానే ఉండాలి..

జిల్లాలో అడవులు పెరిగిన నేపథ్యంలో చిరుతల సంఖ్య పెరిగింది. ప్రజలు వాటి పట్ల అప్రమత్తంగానే ఉండాలి. వీరన్నపేట సమీపంలోని తిర్మల్‌దేవునిగుట్ట వద్ద బోనులో చిక్కిన చిరుతను హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు తరలించాం.

– సత్యనారాయణ, డీఎఫ్‌ఓ

5 బోన్లు ఏర్పాటు..

టీడీగుట్ట, శ్మశాన వాటిక ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుతను పట్టుకునేందుకు అటవీ, పోలీసు అధికారులు, సిబ్బంది రెండున్నర నెలలుగా నిరంతరాయంగా శ్రమించారు. ఎప్పటికప్పుడు చిరుత కదలికలను పసిగట్టేందుకు ఆయా ప్రాంతాల్లో 20 ట్రాప్ కెమెరాలు, 5 లైవ్ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు 2 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు. ఎలాగైనా చిరుతను బంధించేందుకు 5 బోన్లు ఏర్పాటు చేశారు.

మరిన్ని చిరుతలు..?

పాలమూరు పట్టణ సమీపంలోని గుట్టల్లో మరిన్ని చిరుతలు ఉన్నాయనే ఆందోళన స్థానికులను వెంటాడుతోంది. వీరన్నపేట సమీపంలో తిర్మల్‌దేవునిగుట్ట వద్ద బోనుకు చిక్కిన చిరుత చిన్న వయసు కలిగి ఉండటంతోపాటు ఆడపులిగా నిర్ధారించడం, రెండున్నర నెలలుగా గుట్టపై సంచరిస్తూ ట్రాప్ కెమెరాలో నమోదైన చిరుత పెద్దదిగా ఉండటం వంటివి పై అనుమానాలకు బలం చేకూరుస్తోంది. అంతేకాకుండా ట్రాప్ కెమెరాల్లో రికార్డయిన చిరుత, దాని పగ్ మార్క్స్ గుర్తించి మగపులిగా అప్పట్లో జిల్లా అటవీశాఖ అధికారులు పేర్కొనడం, ప్రస్తుతం ఆడపులిగా గుర్తించడాన్ని చూస్తే మరిన్ని చిరుతలు ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా.. వీరన్నపేట సమీపంలో తిరుమల దేవుని గుట్ట వద్ద బోనులో చిక్కిన చిరుతను చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.





బోనులో నుంచి తప్పించుకునే క్రమంలో గాయపడిన చిరుత.. సీసీ కెమెరాలో చిక్కిన చిరుత (ఫైల్)

గుప్తనిధుల కోసం గుడిగోపురం ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన శివాలయం గోపురం

బల్మూర్: గుప్తనిధి కోసం గుర్తు తెలియని దుండగులు గుడిగోపురం ధ్వంసం చేసిన ఘటన సోమవారం వెలుగు చూసింది. మండలంలోని బాణాల సమీపంలోని పురాతన కాకతీయుల నాటి శివాలయంపై గోపురాన్ని దుండగులు ధ్వంసం చేసి గుప్త నిధి కోసం ప్రయత్నించారు. గమనించిన గ్రామస్తులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివాలయంపై ఉన్న గర్భ గుడి గోపురాన్ని దుండగులు ధ్వంసం చేయడంతో కొంతభాగం కిందపడిన అనవాలు అక్కడ ఉన్నాయి. శివాలయం గ్రామానికి దూరంగా ఉండడంతో దుండగులు ఇందుకు బరితెగించినట్లు తెలుస్తుంది. గతంలో కూడా శివాలయం లోపలి భాగంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారని, పోలీసులు దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఘటనపై ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

పాముకాటుతో రైతు మృతి



శ్రీను (ఫైల్)

వంగూరు: మండలంలోని సర్వారెడ్డిపల్లి తండాకు చెందిన రైతు నేనావత్ శ్రీను(36) సోమవారం పాముకాటుకు గురై మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. శ్రీను మండలంలోని ఉల్లంపల్లి శివారులో పది ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సేద్యం చేస్తున్నాడు. సోమవారం వ్యవసాయ పనుల కోసం తండా నుంచి కొంతమంది కూలీలను తీసుకొని పొలానికి వెళ్లాడు. కూలీలు ఒకవైపు వరి మడుల్లో పనిచేస్తుండగా శ్రీను మరో మడిలో పనిచేస్తూ పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత కూలీలు గమనించి, పాటు కాటు వేసిందని గుర్తించి చికిత్స కోసం ఆటోలో వంగూరుకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి 108లో కల్వకుర్తికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ దుర్మరణం



ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ఉండవెల్లి శివారులో అర్ధరాత్రి గుర్తు తెలియని మహిళను గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టాయి. దీంతో రోడ్డుపై అవయవాలు చెల్లాచెదురైన మృతుదేహాన్ని హైవే సిబ్బంది గుర్తించి పోలీసులకు సోమవారం సమాచారం అందించారు. సమాచారం తెలియడంతో నేరుగా ఎస్‌ఐ శేఖర్ మృతదేహం వద్దకు వెళ్లి పరిశీలించారు. హైవే సిబ్బందికి దొరికిన అవయవాలను పోలీసులు అలంపూర్ మార్చురీకి తరలించారు. మృతి చెందిన మహిళ చీర పసుపు పచ్చరంగు, ఎరుపు రంగు జాకెట్, ఒక నలుపు రంగు సంచి, తాళం చెవి, ఒక ఆంత్రం ఉందన్నారు. గుర్తించిన వారు ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ శేఖర్ సూచించారు.

మహిళ మృతి



మహేశ్వరి(ఫైల్)

లింగాల: కుటుంబ కలహాలతో ఇంటి నుంచి అదృశ్యమైన మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొత్తచెర్వుతండాకు చెందిన ఆరెకంటి లక్ష్మి(42) ఈ నెల 12న కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లి పోయింది. కుటుంబ సభ్యులు ఆమెను ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. కొత్తచెర్వుతండా నుంచి అంబట్‌పల్లి మార్గంలో ఓ నీటి గుంటలో పశువుల కాపర్లకు ఆమె మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. అదృశ్యమైన మహిళగా ఆమెను గుర్తించారు. ఆమెకు భర్త కురుమయ్య, ముగ్గురు సంతానం ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

నవాబుపేట: మహిళ అదృశ్యమైన ఘటనపై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మండలంలోని కొండాపూర్‌కు చెందిన వడ్డె మహేశ్వరి(30) ఇంట్లో నుంచి ఆదివారం రాత్రి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఈ విషయంలో భర్త వడ్డె శేఖర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, మహిళ తనతోపాటు ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రించామని.. తాను నిద్రలోకి వెళ్లిన అనంతరం మధ్య రాత్రి మెళకువ వచ్చి చూస్తే ఆమె కనిపించ లేదని పోలీసులకు వివరించాడు. సోమవారం బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ విషయంలో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాస్మోల్ తాగి మహిళ బలవన్మరణం

గోపాల్‌పేట: అప్పుల బాధ భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. పొలికెపాడుకు చెందన కేతేపల్లి నిరంజన్ కూతురు మనీషా(26)కు ఏడేళ్ల కిందట శ్రీపురం గ్రామానికి చెందిన కుర్మయ్యతో వివాహమైంది. ఏడాది తర్వాత విడాకులు తీసుకుంది. అనంతరం తండ్రితోపాటు హైదరాబాద్‌లో ఉంటూ కిరాణా షాపు నడిపించుకుని బతుకుతుండేది. రెండేళ్ల కిందట కిరాణాషాపు షార్ట్ సర్క్యూట్‌లో దగ్ధమై సుమారు రూ.8లక్షల వరకు నష్టపోయింది. తెలిసినవారితో అప్పులు చేసి కిరాణాషాపు తిరిగి ప్రారంభించింది. సరిగ్గా నడవకపోవడంతో మనస్తాపానికి గురైంది. పొలికెపాడు చేరుకొని ఆదివారం వాస్మోల్ తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వనపర్తి ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. తండ్రి నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

పీయూ స్నాతకోత్సవానికి కమిటీలు



స్నాతకోత్సవ కమిటీలతో చర్చిస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వచ్చే నెల 16న పీయూ 4వ స్నాతకోత్సవం నిర్వహించేందుకు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం వీసీ శ్రీనివాస్ అధ్యక్షతన పలు కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఫైనాన్స్ కమిటీ చైర్మన్‌గా రిజిస్ట్రార్ రమేష్‌బాబును, మెటీరియల్ కంటెంట్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, గోల్డ్‌మెడల్స్ కమిటీ చైర్మన్‌గా కంట్రోలర్ ప్రవీణ, ఫెలిసిటేషన్ కమిటీ చైర్మన్‌గా అధ్యాపకులు కిషోర్, హాస్పిటాలిటీ కమిటీ చైర్మన్‌గా వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, స్టేజ్, ఆడిటోరియం కమిటీ చైర్మన్‌గా ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, పబ్లిసిటీ కమిటీ చైర్మన్‌గా ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ నాగం కుమారస్వామిని నియమించారు. ఈ సందర్భంగా వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ స్నాతకోత్సవం నిర్వహణలో కమిటీలు పూర్తిస్థాయిలో పనిచేయాలని, కార్యక్రమాన్ని విజయంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

ఉత్సాహంగా టెక్నికల్ ఎగ్జిబిషన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని స్టేడియం గ్రౌండ్‌లో సోమవారం ఇంజినీర్స్ డేను పురస్కరించుకొని జేపీఎన్‌సీ కళాశాల ఆధ్వర్యంలో టెక్నికల్ ఎగ్జిబిషన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని టెక్నికల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం గొప్ప విషయం అని, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ ప్రదర్శనలను ఏర్పాటు చేయడం ద్వారా పాఠశాలల విద్యార్థులకు స్ఫూర్తిగా ఉంటుందన్నారు. కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ఇంజినీరింగ్, డిప్లొమా కళాశాలల నుంచి మొత్తం 400 మంది విద్యార్థులు 120 ప్రాజెక్టులు తీసుకువచ్చారని, చిన్నపాటి ఆలోచనలే రేపు పెద్ద ఆవిష్కరణలకు దారి తీస్తాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లాకు చెందిన 15 మంది ఇంజినీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సి.భాస్కర్, కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాళ్లు కృష్ణమూర్తి, చంద్రశేఖర్, కంట్రోలర్ కోటాల సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వెంకటేష్ (ఫైల్)

మల్దకల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని మల్లెందొడ్డిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. మల్లెందొడ్డికి చెందిన వెంకటేష్ (30) హోటల్ కొనసాగిస్తూ జీవనం సాగించేవాడు. భార్యభర్తల మధ్య చిన్నపాటి గొడవల కారణంగా ఈ నెల 11న భార్య పద్మ వేడి నూనెను వెంకటేష్‌పై పోయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు గద్వాలకు తరలించి, మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ నందీకర్ తెలిపారు. మృతుడికి భార్య పద్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లింగాల: వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొత్తకుంటపల్లికి చెందిన ఇరగోటి మల్లమ్మ(42) చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. లింగాల నుంచి స్వగ్రామమైన కొత్తకుంటపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త మల్లయ్య, నలుగురు సంతానం ఉన్నారు. మృతురాలి కుమారుడు విష్ణుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు

గద్వాల క్రైం: ఇంటి నిర్మాణాన్ని ధ్వంసం చేయడంతోపాటు కులం పేరుతో దూషిస్తూ యాజమానిపై దాడి చేసిన ఘటనలో 8మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన కురుమ్మన్న రెండో రైల్వేగేట్ సమీపంలోని సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో మోమిన్‌మహల్లా కాలనీకి చెందిన అబ్దుల్ వాజీద్ నిర్మాణం పనులు అడ్డుకుని ఇట్టి స్థలం తనదేనని దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఈ విషయంపై గద్వాల జూనియర్ సివిల్ కోర్టులో గతనెల 30వ తేదీన ఇంజక్షన్ ఆర్డర్ తీసుకుని న్యాయ విచారణకు ఫిర్యాదు చేశామన్నారు. అబ్దుల్ వాజీద్ అదేరోజు సాయంత్రం కొంతమందితో వచ్చి ఇంటి నిర్మాణ పనులను ధ్వంసం చేశాడు. విషయం తెలుసుకుని అడ్డుకునేందుకు వెళ్లిన కుర్మన్నపై ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడిచేసినవారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వీరన్నపేట పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై విద్యాశాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. రెండు రోజుల క్రితం సదరు ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విచారణ జరిపిన జిల్లా విద్యాశాఖ అధికారులు.. అతడిని విధుల నుంచి సస్పెన్షన్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. పోలీసులు సదరు ఉపాధ్యాయుడిని అరెస్టు చేసిన క్రమంలో సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు.

వ్యక్తికి జైలుశిక్ష

ఊర్కొండ: కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన సైదులు ఫిబ్రవరిలో ఊర్కొండ మండలం ముచ్చర్ల పల్లిలో చోరీ చేశాడు. పోలీసులు నిందితుడిని కల్వకుర్తి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు. జడ్జి కావ్య నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈపీఎఫ్ అవకతవకలపై విచారణ

అధికారికి సమస్యలు విన్నవించిన పుర కార్మికులు



కార్మికులతో మాట్లాడుతున్న విచారణ అధికారి కేతన్

జడ్చర్ల టౌన్: స్థానిక పురపాలికలో 2012–2104 ఆర్థిక సంవత్సరాల్లో కార్మికుల వేతనాల్లో విధించిన ఈపీఎఫ్ కోతల డబ్బులను వారి ఖాతాలో జమ చేయలేదు. దీంతో కార్మికులు వివిధ కారణాలతో మృతిచెందితే వారి కుటుంబాలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. ఈ విషయంపై మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ అనేక దఫాలు ఏళ్లుగా ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే 2025, మే 30న యూనియన్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు, విన్నపాలకు స్పందించి సోమవారం విచారణ నిమిత్తం హైదరాబాద్ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేతన్ పుర కార్యాలయానికి వచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్, అకౌంటెంట్ మనోజ్‌తో సమావేశమయ్యారు. 2012–2014లో పనిచేసిన కార్మికుల వివరాలతో పాటు ఇప్పటి వరకు మృతిచెందిన వారి జాబితా ఇవ్వాలని సూచించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌తో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2012–2014 మధ్య జరిగిన ఈపీఎఫ్ లోపాల గురించి వెంకటేశ్ ఆయనకు వివరించారు. ఇప్పటి వరకు 46 మంది కార్మికులు మృతిచెందగా ఏ ఒక్కరికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని తెలిపారు. కార్మికుల వేతనాల్లో డబ్బులు కట్ చేసి పీఎఫ్ ఖాతాలో జమ చేయనందునే ఈ పరిస్థితి తలెత్తిందని తెలియజేశారు. విచారణ అధికారి కేతన్ మాట్లాడుతూ.. పీఎఫ్ నిధికి మున్సిపల్ కార్యాలయం నుంచి జమచేసిన రూ.40 లక్షలను కార్మికుల జాబితా ప్రకారం వారి వ్యక్తిగత ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్మికులకు వర్తించే హక్కుల గురించి అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి వికసిత్ రోజ్‌గార్ యోజన ద్వారా నెలకు రూ.15 వేలు ఎలా పొందాలో తెలియజేశారు. విచారణ అధికారిని కలిసిన వారిలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఇందిరమ్మ, కార్మికులు ఉన్నారు.

పగలు బొంతలు కుట్టే పని.. రాత్రికి చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణయ్య, ఎస్‌ఐలు

వనపర్తి: ఖాకీ సినిమా తరహాలో ఉదయం జీవనోపాధి కోసం పనిచేసుకుంటున్నట్లుగా జనావాసాల మధ్య సంచరిస్తూ.. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుని రాత్రి సమయంలో దోపిడికి పాల్పడుతున్న బొంతలు కుట్టే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం రూరల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఆరుగురు నిందితులు ముఠాగా ఏర్పడి ముందస్తు పథకం ప్రకారం ఒక వ్యాన్‌లో బొంతలు కుట్టే వృత్తి పేరుతో గ్రామాల్లో తిరుగుతారు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి సమయంలో తమ వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్లతో ఇంటి తాళం, బీరువాలను పగలగొట్టి బంగారు, వెండి వస్తువులతో పాటు నగదు ఎత్తుకెళ్తారు. ఇటీవల ఇలాంటి చోరీ వనపర్తి మండలంలోని పెద్దగూడెంతండాలో చోటుచేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ముఠాను పట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ఈ నెల 14న సాయంత్రం పెద్దగూడెం క్రాస్ రోడ్డు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలు చేపట్టారు. మినీ వ్యాన్‌లో ఇనుప రాడ్లతో అనుమానస్పదంగా ప్రయాణిస్తున్న వారిని విచారించగా.. పలుచోట్ల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కొండ హరికృష్ణ, గజ్జుల కృష్ణయ్య, గజ్జుల వినోద్, గజ్జుల భాగ్యలక్ష్మితో పాటు వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణానికి చెందిన గుజ్జుల రాజశేఖర్, గుజ్జుల లక్ష్మిని రిమాండ్‌కు తరలించారు. వీరిపై పెబ్బేరు, ఆత్మకూరు, నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదైఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రూ.25 వేల నగదు, 25 గ్రాముల బంగారం, 43 తులాల వెండి, ఓమిని కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన వనపర్తి సీఐ కృష్ణయ్య, ఎస్‌ఐలు జలంధర్ రెడ్డి, వేణుగోపాల్, కానిస్టేబుళ్లు రఫీ, అంజనేయలును డీఎస్పీ అభినందించారు.

అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయి..

- ఆటోను తగులపెట్టిన వ్యక్తి
- భార్యాపిల్లలపై పెట్రోల్ పోసేయత్నం..
- అడ్డుకున్న ఇతర వాహనదారులు



తగలబడిన ఆటో

మహబూబ్‌నగర్ క్రైం: తనకు వారసత్వంగా వచ్చిన భూమికి విరాసత్ చేయకుండా గత కొన్ని రోజుల నుంచి రెవెన్యూ అధికారులు వేధింపులకు గురి చేయడంతో విసిగిపోయిన ఓ ఆటో డ్రైవర్ మొదట ఆటోపై పెట్రోల్ పోసి తగలపెట్టాడు. ఆ తర్వాత భార్యాపిల్లలపై పెట్రోల్ పోయడానికి యత్నించే క్రమంలో రోడ్డుపై ఉన్న ఇతర వాహనదారులు పెట్రోల్ బాటిల్‌ను తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. దేవరకద్ర మండలం బస్వాయిపల్లికి చెందిన మాల శంకర్‌కు తన తండ్రి నుంచి 1ఎకరం 3 గుంటల భూమి వారసత్వంగా వచ్చింది. ఈ భూమిని విరాసత్ చేయడానికి 5 ఏళ్ల కిందట నుంచి దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. అయినా అధికారులు నిర్లక్ష్యం చేసి ఇబ్బందులకు గురి చేశారు. ఈ ఏడాది మార్చిలో భూమికి సంబంధించిన ఓఆర్సీ హక్కులు సైతం శంకర్‌కు వచ్చాయి. దీనిని ఆన్‌లైన్ నమోదు చేసి మ్యాన్‌వల్‌గా ఓఆర్సీ సర్టిఫికెట్, పట్టదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని మూడు నెలల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి అలసిపోయాడు. చివరకు సోమవారం సాయంత్రం తనకు సంబంధించిన ఆటోను పాలమూరు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పెట్రోల్ పోసి తగలబెట్టాడు. ఆ తర్వాత కొంత పెట్రోల్‌ను భార్య, ముగ్గురు అమ్మాయిలపై పోయడానికి ప్రయత్నం చేస్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న ఇతర వాహనదారులు అడ్డుకున్నారు. మొదట ఆటోలో ఉన్న కుటుంబ సభ్యులను బయటకు దించి వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆటోపై పోసి ఆ తర్వాత నిప్పు అంటించడంతో ఆటో పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలానికి టూటౌన్ పోలీసులు, మహబూబ్‌నగర్ రెవెన్యూ అధికారులు చేరుకుని వివరాలు సేకరించారు. మహబూబ్‌నగర్ అర్బన్ డీటీ దేవేందర్ ఆధ్వర్యంలో రిపోర్ట్ తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందించారు.

ఐదేళ్లుగా తిరుగుతున్నాడు

మాల శంకర్‌కు వారసత్వంగా వచ్చిన భూమిని విరాసత్ చేయడం కోసం ఐదేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరిగాడు. ఇటీవల ధరణిలో రావడంతో అప్పటి నుంచి పాసు పుస్తకంతో పాటు ఓఆర్సీ సర్టిఫికెట్ కోసం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఎంతో డబ్బులు ఖర్చు చేసుకున్నాడు. ఇటీవల ధరణిలో నమోదు కావడంతో ఓఆర్సీ, పట్టాదారుపాస్ పుస్తకం మ్యాన్‌వల్‌గా ఇవ్వడానికి దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని విసిగిపోయాడు. ఈ ఘటనపై దేవరకద్ర ఆర్‌ఐని 'సాక్షి' వివరణ కోరగా మాల శంకర్ 45రోజుల కిందట భూ భారతిలో దరఖాస్తు చేసుకున్నాడని, దీనిపై విచారణచేసి ఫైల్ తహసీల్దార్‌కు ఇచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ సంతకాలు చేసి ఫైల్ ఆర్డీఓ కార్యాలయానికి పార్వర్డ్ చేయడం జరిగిందని, ప్రస్తుతం ఫైల్ అక్కడే ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మహబూబ్‌నగర్ ఆర్డీఓకు ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

జూరాలకు పెరిగిన వరద

1.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
14 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్/రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద సోమవారం పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం 79 వేల క్యూసెక్కులు ఉండగా.. సోమవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో 1.20 లక్షల క్యూసెక్కులకు చేరిందన్నారు. దీంతో ప్రాజెక్టు 14 క్రస్ట్ గేట్లు పైకెత్తి 1,01,250 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు చెప్పారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 43,443 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45, భీమా లిఫ్ట్–1కు 650, ఎడమ కాల్వకు 550, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.480 టీఎంసీలు ఉందన్నారు.

474 మెగావాట్ల విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో సోమవారం ఉత్పత్తి కొనసాగుతున్నట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 329.266 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 354.535 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 683.801 మి.యూ. విద్యుదుత్పత్తి జరిగిందని వివరించారు.

సుంకేసులకు 35,450 క్యూసెక్కులు..

సుంకేసుల జలాశయానికి సోమవారం ఎగువ నుంచి 35,450 క్యూసెక్కుల వరద రాగా.. ఏడు గేట్లను మీటర్ మేర తెరిచి 30,884 క్యూసెక్కులను దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర వివరించారు. అలాగే కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు సరఫరా చేసినట్లు తెలిపారు.